క్లుప్తంగా

గణనాథునికి విశేష అలంకరణ


తీపర్రులో లక్ష్మీగణపతిగా విఘ్నేశ్వరుడు

పెరవలి: గణపతి నవరాత్రులు సందర్భంగా శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఊరేగింపులు చేస్తుంటే కొన్ని గ్రామాల్లో విశేష అలంకరణ చేస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో భారీ అన్న సమారాధనలు నిర్వహించారు. తీపర్రులో లక్ష్మీ గణపతిగా రూ.10 లక్షలతో అలంకరణ చేశారు. కాకరపర్రులో ఎలుక వాహనంగా వివిధ రకాల పూలతో అలంకరణ చేసి ఊరేగింపు చేశారు, అన్నవరప్పాడు, మల్లేశ్వరం, కడింపాడు గ్రామాల్లో భారీ అన్న సమారాధనలు నిర్వహించారు.

మదర్ థెరిసాకు నివాళులు

నిడదవోలు రూరల్: మానవ సేవే మాధవ సేవగా భావించిన మాతృమూర్తి మదర్ థెరిసా సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని తృప్తి ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు వడ్లమూడి దేవదాసు అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం శాంతిసెంటర్‌లో బాబూ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో మదర్ థెరిసా వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మదర్ థెరిసా విగ్రహానికి దేవదాసు, ముప్పిడి రాజారత్నం, కొల్లి శ్రీను, యూత్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మెరిపే సత్తిరాజు, కొక్కిరపాటి మధు, ముప్పిడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు ఉద్యోగులకు విశ్రాంతి భవనం

నల్లజర్ల: మండలంలో రిటైర్డు ఉద్యోగులు తమ సంఘ కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు మండల కేంద్రంలో భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఆ సంఘ నేతలు శుక్రవారం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజును కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి స్థలం మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. రిటైర్డు ఉపాధ్యాయుల్లో తమ గురువులు ఉన్నారన్నారు. మండల శాఖ అధ్యక్షులు ఐవీ సత్యం, ఉన్నమట్ల వెంకటేశ్వరావు, ఐడీవీ అప్పారావు తదితరులు ఆయనను కలసిన వారిలో ఉన్నారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత

నల్లజర్ల: గతేడాది దూబచర్ల ఎలైట్ కళాశాలలో కళాశాలలో ఎంపీసీలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థికి ల్యాప్‌టాప్ ఇస్తానని ఎమ్మెల్యే వాగ్దానం చేశారు. గురుపూజోత్సవ వేడుకలో భాగంగా ఎంపీసీలో అత్యుత్తమ మార్కులు సాధించిన ఆశాశ్రీకి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు శుక్రవారం ల్యాప్‌టాప్ అందించాకు. పదో తరగతి విద్యార్థిని బిందుషాలీనిని మెమోంటోతో సత్కరించారు.

ఉపాధ్యాయులకు సత్కారం

గురుపూజోత్సవం సందర్భంగా కళాశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు గారపాటి సుబ్బారావు, సుజాత, సమీరాను ఎమ్మెల్యే పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. సమావేశంలో ఎంఈఓ-1 సత్యనారాయణ, ప్రిన్సిపాల్ కలగర శ్రీలక్ష్మి, డైరక్టర్లు సుదర్శనం, సుబ్బారావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

దేవరపల్లి: మండలంలోని స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద రూ.12 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు పూర్తి చేసినట్టు మండల పరిషత్ అధ్యక్షుడు కుప్పాల వెంకట దుర్గారావు తెలిపారు. మండల పరిషత్ నిధులు రూ.5 లక్షల వ్యయంతో మంచి నీటి బోరు, రూ.7లక్షల వ్యయంతో పక్కా సీసీ డ్రైన్ నిర్మాణం చేసినట్టు ఆయన చెప్పారు. గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించడానికి నిధులు మంజూరు చేసినట్టు ఆయన చెప్పారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, గ్రావెల్ రోడ్లు, బడగు, బలహీన వర్గాలకు చెందిన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. జగనన్న లేఅవుట్‌లో రూ.4 లక్షల వ్యయంతో గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేశామని తెలిపారు. స్థానిక మూడు రోడ్ల ప్రధాన కూడలి ప్రాంతంలో ప్రమాదకరంగా ఉన్న గుంతలను ఎంపీపీ దుర్గారావు పరిశీలించారు. గుంతలను వెంటనే పూడ్చాలని స్థానిక కాంట్రాక్టను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దుగ్గిన గంగాధర్, కామిశెట్టి దుర్గారావు, పచ్చా రాంగోపాల్, వెలగా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రైడేను డ్రైడేగా పాటించాలి

నల్లజర్ల: డ్రైడే సందర్భంగా పోతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద దోమల నివారణపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టరు సిరాజుద్దీన్ మాట్లాడుతూ, ఇటీవల కురుస్తున్న వర్షాలకు జ్వరాలు ప్రభలుతున్నాయని, ఇవన్నీ దోమకాటుకు సంబంధించినవేనన్నారు. పరిశుభ్రత లోపంతోనే దోమలు రోజురోజుకు ఉధృతి చెందుతాయన్నారు. ఆడ అనాలఫిస్ దోమ కుట్టడం ద్వారా మలేరియా సోకుతుందన్నారు. పగటి వేళ కుట్టే ఏడిస్ అనే ఆడ దోమ ద్వారా డెంగీ వ్యాధి సంక్రమిస్తుందన్నారు. క్యూలెక్స్ ఆడ దోమ కుట్టడం ద్వారా మెదడువాపు వ్యాధి, ఏడిస్ ఈజిప్ట్ దోమల ద్వారా చికున్ గున్యా వ్యాధి సంక్రమిస్తుందన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు రాత్రివేళ తొందరగా దోమలు ఇంట్లోకి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడం, దోమతెరలు వాడటం ద్వారా దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పోతవరం పీహెచ్‌సీ పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్లు జయప్రకాష్, ఎంపీహెచ్ఎస్ మీరాబాయ్, ఎస్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వామ్మో.. ఇదేం ట్రాఫిక్ భయ్యా.!

- ఆక్రమణలతో తప్పని చిక్కులు
- రోడ్లపైకి వస్తున్న దుకాణదారులు
- నిబంధనలు పాటించని వాహనదారులు


వాహనాలతో రద్దీగా ఉన్న తాళ్లపూడి మెయిన్‌రోడ్డు


తాళ్లపూడి బజారులో ఆక్రమణలకు గురైన ఆర్‌అండ్‌బీ రోడ్డు

తాళ్లపూడి: ఇరుకుగా మారిన రోడ్డుతో ట్రాఫిక్ సమస్య కారణంగా నిత్యం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. తాళ్లపూడిలోని మెయిన్‌రోడ్డులో వాహనాల రాకపోకలు విపరీతంగా పెరగడం, షాపుల నిర్మాణాలు రోడ్డుపైకి రావడంతోపాటు, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో మరింత ఇబ్బందికరంగా మారింది. తాళ్లపూడి బజార్ సెంటర్‌లోని ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆక్రమణకు గురికావడంతో ఏళ్ల తరబడి తీరని సమస్యగా ఉంది. వ్యాపారులు తమ వ్యాపారాల కోసం దుకాణాలను రోడ్డుపైకి విస్తరించడంతో సామాన్య ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రం కావడంతో తాళ్లపూడికి నిత్యం గోపాలపురం, పోలవరం, కొవ్వూరు మండలాల నుంచి వివిధ పనుల నిమిత్తం అధిక సంఖ్యలో ప్రజలు, వాహనదారులు వస్తుంటారు. వీరితో పాటు రాజమండ్రి, నిడదవోలు తదితర ప్రాంతాలకు తాళ్లపూడి మెయిన్‌రోడ్డు గుండా నిత్యం వందలాది మంది ప్రయాణాలు సాగిస్తుంటారు. దీంతో తాళ్లపూడి బజార్ సెంటరులో నిత్యం ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇటీవల కాలంలో వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. అంతేకాకుండా భారీ వాహనాలు, ఊకలారీలు, ఇతర భారీ వాహనాలు, ఇసుక లారీలు రాకపోకలు సాగిస్తుండటంతో కాలు కదపడానికి వీలులేని పరిస్థితులు నెలకొంటున్నాయి. సాయంత్రం సమయంలో ట్రాఫిక్ తరచూ జామ్ అవుతుంది.

తీరని సమస్యగా ట్రాఫిక్ రద్దీ

తాళ్లపూడి బస్టాండ్ నుంచి ప్రక్కిలంక మలుపు వరకూ సుమారు కిలో మీటరు మేర రోడ్డు ఉంటుంది. బజార్ సెంటర్‌లోని ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆక్రమణకు గురైంది. గతంలో సుమారు 80 అడుగులు రోడ్డు ఉండేదని, ప్రస్తుతం సుమారు 40 అడుగులకు కుదించుకుపోయిందని స్థానికులు అంటున్నారు. 28 ఏళ్ల క్రితం ఆక్రమణల తొలగింపునకు ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టారు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా పూర్తిస్థాయిలో ఆక్రమణల తొలగింపు జరగలేదు. మళ్లీ 2010లో అప్పటి సర్పంచ్ ఆక్రమణల తొలగింపునకు పంచాయతీలో తీర్మానం చేసి తహసీల్దార్‌కు పంపించారు. అనంతరం సర్పంచ్‌లు మారడంతో సమస్య అలాగే ఉండిపోయింది. తరువాత కాలంలో ఆక్రమణల తొలగింపునకు ఎవరూ శ్రద్ధ చూపకపోవడంతో ట్రాఫిక్ రద్దీ తీరని సమస్యగా మారింది. 8 సంవత్సరాల క్రితం ఆర్‌అండ్‌బీ అధికారులు, రెవెన్యూ అధికారులతో కలిసి సర్వే చేసి రోడ్డు కొలతలు తీసుకున్నారు. మార్కింగ్ కుడా వేశారు. దీంతో అప్పట్లో ఆక్రమణలు తొలగిస్తారని పెద్ద చర్చసాగడంతోపాటు ఆక్రమణదారుల్లో గుబులు చెలరేగింది. అధికారులు మళ్లీ దీనిపై నోరు మెదపడం లేదని స్థానికులు అంటున్నారు. వ్యాపారులు పోటీ పడి రోడ్డుపైకి దుకాణాలు విస్తరిస్తున్నారు. అయితే డ్రైన్ కూడా సమస్యగా మారింది. రోడ్డు ఆక్రమణలు, డ్రైన్ నిర్మాణంపై ప్రజలు పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు కూడా చేశారు. రోడ్డుకు ఇరువైపులా డ్రెయిన్ ఏర్పాటు చేస్తే చాలా వరకు ఆక్రమణలు తొలగిపోయే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.

ప్రమాదాలు జరుగుతున్న వైనం

ఇటీవల కాలంలో నియోజకవర్గంలోని కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడిలో వాహనాలు విపరీతంగా పెరిగాయి. దీనికి తోడు వారు నిబంధనలు ఏ మాత్రం పాటించకుండా ఎక్కడ పడితే అక్కడ అడ్డదిడ్డంగా ఆపుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వెనుక నుంచి వస్తున్న వాహనాలను ఏమాత్రం చూడకుండా సడన్‌గా బ్రేక్ వేస్తున్నారు. పలు సందర్భాల్లో ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్న లారీలు, ఆటోలపై చర్యలు తీసుకోవాలంటున్నారు. బజారు సెంటర్‌లో పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో షాపుల వద్దకు వచ్చేవారు రోడ్డుపైనే అడ్డంగా వాహనాలు నిలిపివేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు సమస్యపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

డ్రెయిన్ ఏర్పాటు చేసి ఆక్రమణలు తొలగించాలి



బజార్‌లోని మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్ నిత్యం పెరుగుతోంది. దీంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మెయిన్‌రోడ్డులో ఇరువైపులా డ్రెయిన్ ఏర్పాటు చేసి, రోడ్డు ఆక్రమణలు తొలగించాలి. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– కలిశెట్టి సన్యాసినాయుడు, మండల బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు తాళ్లపూడి.

ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు



మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో వాహనదారుల నుంచి ప్రజలకు ఇబ్బందులు లేకుండా సిబ్బందిని ఏర్పాటు చేస్తాం. సాయంత్రం సమయంలో వాహనదారులు నిబంధనలు పాటించాలి. బజార్ సెంటర్‌లో దుకాణదారులు రోడ్డుపైకి రాకూడదు. ఆటోలు, ఇతర వాహనాలు కూడా రోడ్డుపై అడ్డంగా ఉంచకుండా చర్యలు తీసుకుంటాం. షాపులు ముందు వాహనాలు పార్కింగ్ చేస్తే యజమానులకు నోటీసులు ఇస్తాం. ట్రాఫిక్ సమస్య తీర్చేందుకు రోడ్డుకు ఇరువైపులా మార్కింగ్ చేస్తాం.

– టి.రామకృష్ణ, ఎస్సై, తాళ్లపూడి.

ఎరువుల దుకాణాల తనిఖీ


కొవ్వూరులో సొసైటీ వద్ద ఎరువుల నిల్వలు తనిఖీ చేస్తున్న ఆర్డీవో

తాళ్లపూడి(కొవ్వూరు): యూరియా సహ ఇతర ఎరువులను రైతులకు సక్రమంగా అందజేయాలని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. పట్టణంలోని ప్యాక్ సొసైటీ, దొమ్మేరూ, కాపవరంలోని సొసైటీ గోదాములను ఆర్డీవో తనిఖీ చేసి యూరియా నిల్వలు, ఎరువుల దుకాణాలను పరిశీలించారు. రైతులకు సరఫరా అయ్యే ఎరువులు సక్రమంగా వినియోగమవుతున్నాయా అనే అంశాన్ని పరిశీలించి, రికార్డుల నిర్వహణపై సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు. ఆర్డీవో మాట్లాడుతూ, రైతులు వ్యవసాయ శాఖాధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకు దశల వారీగా ఎరువులను వాడాలని, అవసరానికి మించి ఎరువులు- పురుగు మందులు వాడితే పంటలకు నష్టం కలుగుతుందని ఆర్డీవో స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్యాక్ సొసైటీ సిబ్బంది, ఎరువుల దుకాణాల యజమానులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి మండలంలో..

తాళ్లపూడి మండలంలోని సొసైటీలను విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. ఎరువులు నిల్వ తదితర అంశాలను పరిశీలించారు.

మహమ్మద్ ప్రవక్త మార్గం అనుసరణీయం

నిడదవోలు రూరల్: సర్వమానవాళి కోసం మహమ్మద్ ప్రవక్త చేసిన బోధనలు స్ఫూర్తి దాయకమని, ఆయన మార్గాన్ని అనుసరించాలని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినం పురస్కరించుకుని ముస్లింలు భక్తిశ్రద్ధలతో మిలాద్- ఉన్- నబీ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మసీదు వద్ద జరిగిన వేడుకలకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలోని సమిశ్రగూడెం, తాడిమళ్లలోని మసీదుల్లో ప్రత్యేక నమాజులు చేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్ వజీరుద్దీన్, మాజీ సర్పంచ్ ఎండీ అక్రం, ముస్లిం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిడదవోలు: పట్టణంలో అహలే సున్నత్ వల్ జమాత్ ఆధ్వర్యంలో శుక్రవారం మహ్మద్ ప్రవక్త జన్మదిన (మిలద్ ఉన్ నబీ) వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలో పవిత్ర ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మద్రసా వద్ద ఒడిశాకు చెందిన మత పెద్ద ముఫ్తి మహ్మద్ హనీఫ్ హబీబి సాహేబ్ వారిచే వాజ్ కార్యక్రమం నిర్వహించారు. మంత్రి కందుల దుర్గేశ్ ముఖ్యఅతిథిగా హాజరై మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమ్‌ఖాన్ దావత్ (విందు) ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మద్రసా అధ్యక్షుడు ఎండీ మజాహక్, మున్సిపల్ వైస్ చైర్మన్ వజీరుద్దీన్, అజీజ్ భాషా తదితరులు పాల్గొన్నారు.

సొసైటీలను తనిఖీ చేసిన అధికారులు

తాళ్లపూడి: యూరియా సరఫరా సక్రమంగా జరగటం లేదంటూ రైతులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో తాళ్లపూడి మండలంలోని పలు సహకార సంఘాలను విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తాళ్లపూడి మండలం తాడిపూడి విశాల సహకార సంఘం, అన్నదేవరపేట సహకార సంఘాలను విజిలెన్స్ సీఐ మధుబాబు, సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. కాగా, ఎక్కడ ఎలాంటి యూరియా నిల్వలు లేవని తెలిపారు. రెండు సహకార సంఘాల ప్రతినిధులు, కార్యదర్శులు రామచంద్రం, శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారిణి రుచిత తదితరులు ఉన్నారు.

కల్యాణ వైభోగమే

పెరవలి: మండలంలోని అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి, అమ్మవార్లకు మాస కల్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. మాస కల్యాణం చూడటానికి వందలాది మంది భక్తులు వచ్చారు. స్వామి వారి కల్యాణం చేయించుకున్న వారి దంపతులు ఎంతో అన్యోన్యంగా ఉండటమే కాకుండా, వారికి ఎటువంటి భాదలు లేకుండా ఉంటారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ మాట్లాడుతూ. ఎంతో పవిత్రమైన మాస కల్యాణం ప్రతి నెలా జరుపుతామని, అంతే కాకుండా ఆలయ అభివృద్ధి కోసం నిత్య గోత్ర నామార్చన, లక్ష తులసి పూజలు, హోమాలు, అన్నసమారాధన, పూల అలంకరణ వంటి కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు.

సమాజాన్ని ప్రభావితం చేసేది ఉపాధ్యాయులే


సమిశ్రగూడెంలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సూరిబాబు, ఎంఈఓలు


తాళ్లపూడిలోని ఇంటర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొన్న అధ్యాపకులు


రాజమహేంద్రవరంలో కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న దుర్గాదేవి

నిడదవోలు రూరల్: దేశ భవిష్యత్‌ను నిర్దేశించే సమాజాన్ని ప్రభావితం చేసే గురుతర బాధ్యులు ఉపాధ్యాయులేనని నిడదవోలు జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని మండల విద్యాశాఖ, టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో గురుపూజోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు కె.సత్యనారాయణ, ఎండీ తహీనా సుల్తానా, బి.ఫకీర్, వీఎస్ఆర్‌సీహెచ్ మూర్తి, ఎం.సుబ్రహ్మణంను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓలు గణేష్, గురుమూర్తి, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

తాళ్లపూడి: విద్యాబుద్ధులు చెప్పే గురువు స్థానంలో ఉన్న వారిని ఎల్లప్పుడూ గౌరవించాలని పలువురు పేర్కొన్నారు. మండలంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సెలవు దినం కావడంతో పలుచోట్ల ముందుగానే గురువారం నిర్వహించారు. తాళ్లపూడిలోని కరిబండి విద్యాసంస్థల్లోని ఎస్‌కేజీఆర్ అండ్ ఎస్ఎస్‌కే జూనియర్ కళాశాల ఇంటర్ విద్యార్థులు, డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అధ్యాపకుల చేత కేక్ కట్ చేయించి సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మురళి, అధ్యాపకులు మాధవరావు, పాపారావు, సత్యనారాయణ, శ్రీధర్, రవీంద్ర, అమరేంద్ర, గీత, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు

పెరవలి: మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఐదుగురు ఎంపికైయ్యారు. వీరు పిట్టల వేమవరం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ఉమా, పెరవలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు బాల కృష్ణకుమార్, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుడు శ్రీనివాస్ కుమార్, లంకమాలపల్లి దుర్గాదేవి, తీపర్రు నం.2 పెదపోలు రవికుమార్ ఎంపికైనట్లు ఎంఈఓ స్వరూప్ తెలిపారు. వీరంతా గురుపూజోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

దేవరపల్లి: గురుపూజోత్సవం సందర్భంగా గోపాలపురం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 11 మంది ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ అవార్డులు లభించాయి. ఈ అవార్డులను శుక్రవారం రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో జరిగిన వేడుకల్లో కలెక్టర్ ప్రశాంతి ఉపాధ్యాయులకు ప్రదానం చేశారు. విద్యారంగంలో ప్రగతి సాధించిన ఉపాధ్యాయుల కృషిని గుర్తిస్తూ ప్రభుత్వం అవార్డులను ప్రదానం చేసిందన్నారు. ఈ అవార్డులు విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. దేవరపల్లి మండలంలో ఓరుగుంటి నాగరాజు(దేరరపల్లి జెడ్పీ హైస్కూలు), కొయ్య శ్రీనివాసరావు (దేవరపల్లి జెడ్పీ హైస్కూలు), పులపాకల గంగరాజు (ఎంపీపీ స్పెషల్ యన్నగూడెం) ఉత్తమ అవార్డులను అందుకున్నారు. నల్లజర్ల మండలంలో మానుకొండ గంగరాజు (నల్లజర్ల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం), పాల రత్నాల నాగరాజు (తెలికిచర్ల), శ్రీనివాసరావు (ఘంటావారిగూడెం), సుబ్రహమణ్యం (తెలికిచర్ల) అవార్డులు అందుకున్నారు. గోపాలపురం మండలంలో కె.నారాయణరావు (హెచ్ఎం రేగులకుంట), వి.దుర్గాప్రసాద్ (గోపాలపురం జెడ్పీ హెచ్ఎస్), ఎన్‌సీహెచ్ రత్నకుమారి (వేళ్లచింతలగూడెం), సీహెచ్ సూర్యచంద్ర (చిట్యాల) ఉత్తమ అవార్డులు అందుకున్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందన

నిడదవోలు రూరల్: ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని నిడదవోలు విద్యాశాఖ పరిధిలో ఐదుగురు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారాలు అందుకున్నట్లు ఎంఈఓ గణేష్ శుక్రవారం తెలిపారు. రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో జరిగిన గురుపుజోత్సవ వేడుకల్లో పట్టణంలోని ఎన్.భీమారావు (డీఎస్‌వో మున్సిపల్ హైస్కూలు హెచ్ఎం), ఎం.సత్యశ్రీనివాస్ (సోషల్ స్కూల్ అసిస్టెంట్, జెడ్పీహెచ్ఎస్ డి.ముప్పవరం), డి.భాస్కరం(ఎంపీపీ నం.2 పాఠశాల, పందలపర్రు), కె.శ్రీలక్ష్మి (మదర్‌థెరిస్సా మున్సిపల్ ప్రైమరీ స్కూల్), పి.కుసుమ(ఎంపీపీ నం.3 పాఠశాల, కాల్ధారి)లు పురస్కారాలు అందుకున్నారని చెప్పారు. ఈసందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను ఎంఈఓలు కేవీ గణేష్, గురుమూర్తి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా కల్లూరి

పెరవలి: విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించటంలో, వారిని పాఠశాలలో చేర్పించటంలో విశేష ప్రతిభ కనబర్చినందుకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారని ఎంఈఓలు స్వరూప్, షేక్ నూర్జహాన్ తెలిపారు. గురుపూజోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరంలో శుక్రవారం పెరవలి మండలం లంకమాలపల్లిలో ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న కల్లూరి దుర్గాదేవి కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఎంపీపీ కార్నెర్ల ప్రసాద్, తహసీల్దార్ నిరంజన్, ఎంపీడీఓ పద్మజ, ఉపాధ్యాయులు, వివిధ శాఖల అధికారులు ఆమెను అభినందించారు.

గంగమ్మ ఒడికి పార్వతీ తనయుడు


వేగేశ్వరపురంలో కేరళా వాయిద్యాలతో స్వామి వారి ఊరేగింపు


తాడిపర్రులో ఊరేగింపునకు ముస్తాబైన స్వామివారి వాహనం

తాళ్లపూడి: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి ముగింపు సందర్భంగా నిమజ్జనం, ఊరేగింపు కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, యూత్ ఆధ్వర్యంలో కోలహలంగా డాన్స్‌లు, వేషధారణలు, తీన్‌మార్, బాణసంచా ఆకట్టుకున్నాయి. వేగేశ్వరపురంలోని పోతిరెడ్డి వారి వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుడి ఊరేగింపులో కేరళా వాయిద్యాల ప్రదర్శన ఆకట్టుకుంది. తుమాలమ్మ తల్లి ఆలయం వద్ద భారీ వినాయకుడు ఊరేగింపులో వేషధారణలు ఆకట్టుకున్నాయి. తాళ్లపూడి, ప్రక్కిలంక, అన్నదేవరపేట, గజ్జరం తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను ట్రాక్టర్‌పై ఊరేగించి గోదావరిలో నిమజ్జనం చేశారు.

గ్రంథాలయం వీధిలో వేంకటేశ్వరస్వామి కల్యాణం

తాళ్లపూడిలోని గ్రంథాలయం వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద వెలుగుల అన్నవరం ఆధ్వర్యంలో వెంకటేశ్వరస్వామి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. గోపవరం గ్రామానికి చెందిన శ్రీరామ భజన బృందం వారు చేసిన వెంకటేశ్వర గానామృతం అనే కల్యాణం విశేషంగా ఆకట్టుకుంది.

నిడదవోలు రూరల్: నియోజకవర్గంలోని నిడదవోలు, ఉండ్రాజవరం మండలాల్లో వినాయక చవితిని పురస్కరించుకుని 10వ రోజు శుక్రవారం లంబోదరుడి నిమజ్జనోత్సవాలు భక్త జనుల మధ్య ఘనంగా నిర్వహించారు. సమిశ్రగూడెం, తాడిమళ్ల, విజ్జేశ్వరంలో గణనాథుడిని ఊరేగించి భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు. యువకులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. తాడిపర్రులో వినాయకుడిని గౌడ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించి వాహనంపై గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. బ్యాండ్ మేళాలు, విచిత్ర వేషదారణాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈనెల 6న వేలివెన్నుతో పాటు పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనాలను భారీ స్థాయిలో నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

భారీగా గణపతి ఊరేగింపు

నిడదవోలు: పట్టణంలోని గణేష్ చౌక్ సెంటర్లో ఉన్న పూజా గణపతి, కుమారస్వామి వార్ల ఆలయం వద్ద 103వ వార్షికోత్సవ గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 10 గంటలకు స్వామివారి ఊరేగింపును జయప్రదం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమానికి మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఊరేగింపులో బాణసంచా కాల్పులు, విచిత్ర వేషధారణలు, కాళికామాత, రాక్షస వధ, కోయ డాన్సులు, బుట్ట బొమ్మలు, సన్నాయి తాళాలు, ప్రత్యేక మ్యూజికల్ బ్యాండ్లతో పట్టణంలో ప్రధాన సెంటర్ల గుండా ర్యాలీ నిర్వహించిన అనంతరం వినాయక విగ్రహన్ని నిమజ్జనం చేస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు పేర్కొన్నారు.

ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వ నిర్లక్ష్యం


సూరయ్యపేటలో రచ్చబండలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వెంకట్రావు, నాయకులు

తాళ్లపూడి: అటు ప్రజారోగ్యం ఇటు వైద్య కళాశాలను ప్రైవేట్ చేతుల్లోకి తీసుకెళ్లేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం దుర్మార్గమైన చర్య అని వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ కో-ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. తాళ్లపూడి మండలంలోని అన్నదేవరపేట పంచాయతీ పరిధిలోని సూరయ్యపేటలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. తలారి వెంకట్రావు, మండల నాయకులు కలిసి గ్రామంలో రచ్చబండ నిర్వహించి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ, దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ ఆధ్వర్యంలోని 10 కొత్త వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ కోసం నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. నాడు జగన్ తీసుకొచ్చిన మెడికల్ కాలేజీలను కుట్రపూరితంగా అడ్డుకుందన్నారు. వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేయడంతో పేదలకు ఉచిత వైద్య అందదన్నారు. మధ్య తరగతి ప్రజలకు ఖరీదైన వైద్య సేవలను కార్పొరేట్ హాస్పిటళ్లలో జగన్ ప్రభుత్వం ఉచితంగా అందజేసిందన్నారు. చంద్రబాబు పాలనలో ఆరోగ్యశ్రీ నిర్వీర్యం అవుతుందన్నారు. ఆరోగ్యశ్రీ అంటేనే దివంగత మహనేత వైఎస్సార్, వైస్ జగన్ గుర్తుకు వస్తారని, అలాంటి పథకంలో వారి ముద్ర లేకుండా చేయాలనే కుట్రలో భాగంగా బకాయిలు చెల్లించకుండా యజమాన్యాలు సేవలు నిలిపివేసి సమ్మెలకు వెళ్లేలా ప్రభుత్వం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షుడు శ్రీకృష్ణదేవరాయులు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, పార్టీ ముఖ్య నాయకులు తోట రామకృష్ణ, కవల నాగేశ్వరరావు, ఎలిపే రాజు, కందికొండ సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బహుళ పంటల సాగుపై శిక్షణ

చాగల్లు: రైతులు అంతర పంటలు వేసుకోవడం ద్వారా లాభాల బాట పట్టవచ్చని సీపీసీఆర్ఐ విశ్రాంత డైరెక్టర్ చౌడప్ప, హార్టీకల్చర్ జేడీ దేవమణి, డీహెచ్‌వో ఎస్.మల్లికార్జునరావు, కొవ్వూరు ఉద్యాన శాస్త్రవేత్త వి.శివకుమార్, హార్టీకల్చర్ ఆఫీసర్ డి.సుధీర్‌కుమార్ అన్నారు. కలవలపల్లిలో బహుళ పంటల శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముల్లపూడి మురళీకృష్ణ రైతు పొలంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోకో, మిరియాలు, జాజికాయ, దాల్చిన చెక్క, ఆయిల్ పామ్ తోటలను వారు పరిశీలించారు. వివిధ ఉద్యాన పంటల గురించి తెలుసుకొని, అలాగే వాటి మీద వచ్చే దిగుబడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొబ్బరి, పామాయిల్ పంటల్లో అంతర పంటగా కోకో పంటను వేసుకోవాలని రైతులకు వివరించారు. అలాగే మిరియాలు, జాజికాయ, దాల్చిన చెక్క కొత్త పంటలు వేసుకోవడం కూడా రైతులకు మంచి దిగుబడి వస్తాయని వివరించారు.